


ప్రొ॥ డి.ఎమ్ రవిప్రసాద్
చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్

నిజం.. మా నైజం

# మెరిట్ న్యూస్

ఆదివారం, 15 డిసెంబర్ 2024

తెలుగు జాతీయ దినపత్రిక

Hydrabad, ananthapoor, guntur, nellore, rajamandri, rajamahendravaram,Suryapet,siddipet, warangal, Karimnagar, kammam, Kurnool, Kadapa, nizamabad, vizag, Vijayawada, Tirupathi, Chennai, Bengaluru.





FOREVER MATRIMONY

Offer. Offer registration fee only 1000/-

ప్రతి జిల్లాలో మీ అభిరుచికి అనుగుణంగా తగిన చక్కని సాంప్రదాయమైన వధూవరులను ఒక్క క్లిప్తోతో సొంతం చేసుకోండి. Just once click www.forevermatrimony.in అన్ని అన్ని వర్గాల అన్ని కులాల అన్ని మతాల వారికి అనువైన ప్రాంతాలలో తగిన సంబంధాలు ఇక్కడ పొందుపరచబడినవి అన్వేషణ కొనసాగించండి

మరిన్ని కాల్ చేయండి
9676488007




## అన్నదాతకు తీపికబురు..

### తాకట్టు లేకుండా రూ.2లక్షల లోన్ మంజూరు..!



**అన్నదాతలకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుభవార్త చెప్పింది. ఎటువంటి ఆస్తుల తాకట్టు లేకుండా తీసుకునే రుణ పరిమితిని రూ.2 లక్షలకు పెంచేసింది.**

హైదరాబాద్ , మెరిట్ న్యూస్ :

అన్నదాతలకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుభవార్త చెప్పింది. ఎటువంటి ఆస్తుల తాకట్టు లేకుండా తీసుకునే రుణ పరిమితిని రూ.2 లక్షలకు పెంచేసింది. 2025 జనవరి ఒకటో తేదీ నుంచి తాకట్టు లేకుండా రూ.2 లక్షల వరకూ పంట రుణం తీసు కోవచ్చు. చిన్న, సన్నకారు రైతులకు పంటల సాగు వ్యయం భారం కాకుండా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. రోజురోజుకు ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, ఖర్చులు పెరగడంతో రైతులకు రుణ పరపతి సౌకర్యం మెరుగు పర్చాల్సిన అవసరం ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. తాజా నిర్ణయం వల్ల 86 శాతం మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొంది. తాజా నిర్ణయం మేరకు బ్యాంకులు పంట రుణాలపై కొత్త మార్గదర్శకాలు జారీ చేయడంతోపాటు అన్నదాతల్లో అవగాహన కల్పించాలని ఆర్బీఐ ఆదేశించింది. తాజాగా కేంద్రీయ బ్యాంకు నిర్ణయం వల్ల కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) ద్వారా రుణ సౌకర్యం తేలిక కావడంతోపాటు గవర్నమెంట్ మోడిఫైడ్ ఇంటరెస్ట్ సబ్ వెన్షన్ స్కీమ్ కింద సరసమైన వడ్డీరేట్లపై రూ.3-4 లక్షల వరకూ రుణం పొందొచ్చు. 2004లో ఎటువంటి తాకట్టు లేకుండా రూ.10 వేల రుణం మాత్రమే తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ, క్రమంగా ఆర్బీఐ ఈ పరిమితి పెంచుతూ వస్తోంది. కింది స్థాయిలో బ్యాంకులు మాత్రం తాకట్టు లేకుండా రుణాలు మంజూరు చేయడం లేదు. దీనివల్ల పంటల సాగు కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి చిక్కుల్లో పడుతున్నారు.

## తెలంగాణ కులగణన 98 శాతం పూర్తి

### మెగా హెల్త్ ప్రొఫైల్‌కు అడుగు దూరంలో..

### కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ - దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

**తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన 98 శాతం పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలన్న సంకల్పంతో కులగణన చేపట్టామని సీఎం చెప్పారు. మిగిలిన రెండు శాతం పూర్తయితే దేశానికే ఆదర్శంగా నిలిచే కులగణన తెలంగాణ ప్రజల మెగా హెల్త్ ప్రొఫైల్‌గా మారుతుందని అన్నారు.**

హైదరాబాద్ బ్యూరో, మెరిట్ న్యూస్ :

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన 98 శాతం పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలన్న సంకల్పంతో కుల గణన చేపట్టామని సీఎం చెప్పారు. మిగి లిన రెండు శాతం పూర్తయితే దేశానికే ఆదర్శంగా నిలిచే కులగణన తెలంగాణ ప్రజల మెగా హెల్త్ ప్రొఫైల్‌గా మారుతుం దని అన్నారు. హైదరాబాద్‌లో నిర్మించిన కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ - దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ... దొడ్డి కొమురయ్య గారి పోరాటాలను స్మరించుకున్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డు కర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టినట్టుగానే,దొడ్డి కొమురయ్య శాశ్వతంగా గుర్తుండిపోయేలా మంత్రివర్గ సహచరులతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణం ఒక విద్యా వేదిక కావాలన్నారు. కురుమ సోదరులకు విద్య కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ



ఇచ్చారు. రుణమాఫీ, వరికి బోనస్, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, పేదలకు వైద్య సౌకర్యాలు అందించడం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కువగా బలహీన వర్గాలకు అందాయని చెప్పారు. “తెలంగాణకు జమిందారుల తల్లి కాదు. బహుజనుల తెలంగాణ తల్లి ఉండాలి. ఏ తల్లి అయితే మన అమ్మ లాగా ఉంటుందో, అడక్కుండానే మన ఆకలిని గుర్తించి బుక్కెడు అన్నం పెడుతుందో అలాంటి తెలంగాణ తల్లిని తెచ్చుకున్నాం. మన అమ్మకు ప్రతిరూపం. మన అక్కకు ప్రతి రూపం. ఒకపక్క వరి, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న వంటి తెలంగాణలో పండించే పంటతో పాటు నా బిడ్డలు చల్లంగా ఉండాలి. నా బిడ్డలు శాశ్వతంగా అభివృద్ధి పథంవైపు నడవాలని ఆశీర్వదించే తెలంగాణ తల్లిని మనం ప్రతిష్ఠించు కున్నాం” అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంక్లిష్టమైన ఈ అంశంలో ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్లోబల్ ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగ, చమర్ ఇతర అనుబంధ కులాల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.


## సీఎం రేవంత్ రెడ్డిని తన వివాహానికి ఆహ్వానించిన పీవీ సింధు



హైదరాబాద్ బ్యూరో, మెరిట్ న్యూస్ :

భారత ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తన పెళ్లికి ఆహ్వానించారు. ఆమె తన తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లోని జుబ్లిహిల్స్‌లో గల ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆహ్వాన పత్రికను సీఎంకు అందించారు. సీఎం... ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. పీవీ సింధు వివాహం ఈ నెల 22న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో జరగనుంది.పీవీ సింధుకు కాబోయే వరుడి పేరు వెంకట దత్తసాయి. ఎంగేజ్‌మెంట్ జరిగింది. తమ ఎంగేజ్‌మెంట్ కు సంబంధించిన ఫొటోను ఆమె సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. ఒకరి ప్రేమ దక్కిన సమయంలో మనం తిరిగి ప్రేమించాలి అనే కాప్షన్‌తో ఈ పోస్ట్ చేశారు.

## గబ్బాటెస్ట్ తొలిరోజు వరుణుడిదే



**గబ్బా వేదికగా ప్రారంభమైన మూడో టెస్టు మ్యాచ్‌కు తీవ్ర ఆటంకం కలిగించిన వర్షం.**

హైదరాబాద్ బ్యూరో, మెరిట్ న్యూస్ :

బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ప్రారంభమైన మూడో టెస్టుకు వరుణుడి గండం ఎదురైంది. గబ్బా వేదికగా ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజు కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. వర్షం కారణంగా దాదాపు రెండున్నర సెషన్ల ఆట తుడిచిపెట్టుకుపోయింది. మొదటగా ఈ మ్యాచ్?లో టాస్ గెలిచిన టీమ్ ఇండియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు మొదటి రోజు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 28 పరుగులు సాధించింది. క్రీజ్‌లో నాథన్ మెక్‌స్వీనీ (4బి), ఉస్మాన్ ఖవాజా (19బి) ఉన్నారు. భారత బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్ కట్టుదిట్టంగా బంతులేసినప్పటికీ వికెట్ దక్కలేదు. అదనపు ఓవర్లు - నేడు కేవలం గంట ఆట మాత్రమే సాధ్యం కావడం వల్ల రెండో రోజు (ఆదివారం) అదనంగా ఓవర్లను పొడిగించనున్నారు. ఒకవేళ వాతావరణం అనుకూలిస్తే 98 ఓవర్ల పాటు ఆట సాగుతుంది. పైగా ఆటను అర్ధగంట ముందుగానే మొదలు పెడతారు. కానీ ఇప్పటికే వాతావరణ శాఖ, ఈ వారమంతా వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు చెప్పింది. దీంతో మ్యాచ్ ఫలితం తేలుతుందా? లేదా? అని ఫ్యాన్స్‌లో కాస్త టెన్షన్ నెలకొంది. మరో వైపు మ్యాచ్‌ను చూద్దామని వచ్చిన క్రికెట్ ప్రియులకే మొదటి రోజే తీవ్ర నిరాశే ఎదురైంది. కానీ, క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం వారికి టికెట్ల సొమ్మును రిఫండ్ చేస్తామని తెలిపింది.

## మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నాం

### తప్పు చేస్తే శిక్షపడాలి - మంత్రి సీతక్క

హైదరాబాద్ బ్యూరో, మెరిట్ న్యూస్ :



జర్నలిస్ట్ రంజిత్‌పై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నామని, తప్పు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే అన్నారు. ఇటీవల మోహన్ బాబు తన ఇంట్లో ఓ జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై మంత్రి స్పందించారు. దాడిలో గాయపడిన జర్నలిస్ట్ వైద్య ఖర్చులను మోహన్ బాబు భరించాలన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమది ప్రజా ప్రభుత్వమని, జర్నలిస్ట్‌లపై దాడులకు చోటు లేదన్నారు. జర్నలిస్ట్‌ల రక్షణకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మోహన్ బాబు కుటుంబంలో వివాదం నేపథ్యంలో ఈ వార్తను కవర్ చేసేందుకు జర్నలిస్టులు జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ రంజిత్ గాయపడ్డారు. దీనికి సంబంధించి మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు కొట్టివేసింది.